క్లుప్తంగా

సదరం సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా

జియ్యమ్మవలస: దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడినట్లు ఎంపీడీవో ఎస్.రమేష్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మంగళవారం జరగాల్సి ఉండగా, బుధవారానికి వాయిదా వేయడం జరిగిందన్నారు. ఆరోజు పెన్షన్ పొందుతున్న దివ్యాంగులంతా పాలకొండ ప్రభుత్వాస్పత్రికి రావాలని కోరారు.

తాగునీటి బోరు ఏర్పాటు



బోరును పరిశీలిస్తున్న డీఈఈ నాగేశ్వరరావు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్మశానవాటికలో కొత్తగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును డీఈఈ కె.నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం..

సీతంపేట: రాజ్యాంగాన్ని కాపాడుకుందామని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటంతో సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మంజు, దిలీప్, సంజీవ్, గౌతం, కవిత, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. మండలంలోని ఎం.రాజపురంలో ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి చైతన్యశంకర్ దూడలకు నట్టల నివారణ మందు, టీకాలు వేశారు. అలాగే పశువులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జేడీ మన్మథరావు, పశు వైద్యసిబ్బంది, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం

పాలకొండ రూరల్: పట్టణంలోని శ్రీరామా కళామందిర్ సినిమా థియేటర్ వీధిలో కొండ చిలువ సోమవారం రాత్రి కలకలం సృష్టించింది. సమీపంలో ఉన్న పంటపొలాల మీదుగా జనావాసాల మధ్యకు చేరిన ఈ భారీ పాము బుసలు కొడుతుండడంతో గుర్తించిన స్థానికులు హడలిపోయారు. దాదాపు పది అడుగుల మేర ఉన్న కొండచిలువను స్థానిక యువత చాకచక్యంగా తిరిగి పొలాల్లోకి వెళ్లిపోయేలా చేశారు.

నిబంధనలు పాటించాలి

పాలకొండ రూరల్: వాహన చోదకులు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. వేణుగోపాలరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పాలకొండలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయరాదని సూచించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఈయన వెంట సహాయ మోటార్ వెహికల్ అధికారి నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మే 12 నుంచి వేపారమ్మ ఉత్సవాలు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో వేపారమ్మ ఉత్సవాలు మే 12 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, గ్రామపెద్దలు కె.వెంకటరావు, పాండురంగారావు, జి.హరిప్రసాద్, మన్మథరావు, కె.కిశోర్, ఎం.దొరబాబు తెలిపారు. పండగ ఆచారం ప్రకారం సోమవారం గ్రామానికి చెందిన నాయుడులు సమీపంలోని వత్తాడ గ్రామానికి చెందిన దొరల వద్దకు వెళ్లి, ఉత్సవ తేదీలను తెలిపి, వేడుకలకు ఆహ్వానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భామిని: పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొత్తూరు సివిల్ కోర్టు జడ్జి ఎస్.మణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై సేవా దృక్పథం కలిగిన వారు, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, న్యాయ విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, మైత్రీ సంఘం, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు అర్హులని పేర్కొన్నారు. వలంటీర్లుగా నియమించిన వారికి ఎటువంటి జీతభత్యాలు, పారితోషికం, వేతనాలు ఉండవన్నారు. సేవా దృక్పథంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు.

14405కు ఫిర్యాదు చేయండి

పాలకొండ రూరల్: సారా తయారీ, విక్రయాలతో పాటు శాఖాపరమైన సమస్యలు, సలహాలు, ఫిర్యాదులపై సమాచారం అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 14405ను సంప్రదించాలని పాలకొండ ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖాధికారి ఆదేశాల మేరకు ఈ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.

మంచి చెడు → జాగ్రత్తగా చూడు..

- చిన్నారులపై పెరుగుతున్న అకృత్యాలు
- బంధువులు, ఉపాధ్యాయుల నుంచి ఎదురవుతున్న లైంగిక దాడులు
- గుడ్, బ్యాడ్ టచ్‌లపై చిన్నారులు, కౌమార బాలికలు అప్రమత్తంగా ఉండాలి
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



రేగులపాడు కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్ (ఫైల్)

వీరఘట్టం:

ఇటీవల వీరఘట్టం మండలం నడుకూరు సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ తన పాఠశాలలో చదువుతున్న 6,7వ తరగతి బాలికలపై లైంగిక చేష్టలకు పాల్పడి చివరకు చెరసాల పాలయ్యాడు. ఇతనిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆరు నెలలుగా చూస్తే పాలకొండ డివిజన్‌లో ఐదు పోక్సో కేసులు నమోదయ్యాయి. నేటి సమాజంలో బాలికలపై లైంగిక దాడులు, అకృత్యాలు పెరిగిపోతున్నాయి. బంధువులు, ఉపాధ్యాయుల రూపంలో కీచకులు పేట్రేగిపోతున్నారు. చిన్నారుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని తాకకూడని చోట్ల తాకతూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్న సంఘటనలు చూస్తున్నాం. బాలికలు చదువుతో పాటు కొన్ని విషయాలు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. కొద్ది రోజులుగా పాలకొండ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న విద్యా సంస్థల్లో చదువుతున్న బాలికలకు గుడ్ – బ్యాడ్ టచ్ పై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.అలాగే జూనియర్, డిగ్రీ విద్యార్థులకు ర్యాగింగ్ భూతం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు. ఇంటిపక్కన ఉండేవాళ్లు, బాబాయిలు, మామలు, కొత్తవాళ్లు, ఉపాధ్యాయులు ఇలా ఎవరైనా దగ్గరగా తీసుకున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ముట్టుకునే రీతిని గమనించాలని హెచ్చరించారు. మంచి, చెడు స్పర్శలపై పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించడమే కాకుండా స్వీయరక్షణ చర్యలను కూడా వివరిస్తున్నారు.

చిన్నారుల రక్షణకే పోక్సో..

చిన్నారుల పట్ల లైంగిక వేధింపుల నిరోధమే ధ్యేయంగా పోక్సో చట్టంను తీసుకువచ్చారు. ఈ చట్టం ఎటువంటి రక్షణ కలుగుతుందో విద్యార్థినులకు వివరిస్తున్నారు. మంచి స్పర్శ ఎలా ఉంటుంది.. దురుద్దేశంతో కూడిన స్పర్శ ఎలా ఉంటుందో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎవరికైనా ఇలాంటి అనుభవాలు ఎదురై ఉంటే తమకు సమాచారం ఇవ్వాలంటూ సూచిస్తున్నారు. ఎవరైనా లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నిస్తే వారిపై ప్రతిఘటించడం వంటి స్వీయరక్షణ చర్యలపై సలహాలు,సూచనలు ఇస్తున్నారు.

పరిచయస్తులే..

చిన్నారులు, కౌమార దశలో ఉన్న అమ్మాయిలను



లక్ష్యంగా చేసుకుని కొందరు కామాంధులు లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటనల్లో 90 శాతం మంది నిందితులు పరిచయస్తులే. బాధితులు ఫిర్యాదు చేసేంతవరకు నిందితులు మంచివారేనని పిల్లల తల్లిదండ్రుల నమ్మకం. అప్యాయంగా మాట్లాడుతూ, స్నేహంగా ఉండడం వల్ల వీరిపై ఎవరికీ అనుమానం రావడం లేదు. దీనిని ఆసరాగా చేసుకొని కామాంధులు, దుర్మార్గులు వారి విపరీత కోర్కెలు తీర్చుకునేందుకు యత్నిస్తున్నారు. దీన్ని గమనించాలని పోలీసు బృందాలు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల చిన్నారులపై రాష్ట్రవ్యాప్తంగా లైంగిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

తల్లిదండ్రులు గమనించాలి..



కౌమారదశలో ఉన్నవారికి గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉంది. ఎక్కడైనా చిన్నారులను వేధించిన సంఘటనలు జరిగితే వాటిని పిల్లలకు చూపించి చైతన్యపరచాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, బాలకలను అప్రమత్తం చేస్తున్నాం.
– సిమ్మాలమ్మ, సీడీపీఓ, పాలకొండ

అప్రమత్తంగా ఉండాలి..



బిస్కెట్లు, చాక్లెట్లు, ఐస్‌క్రీములు కొనిస్తామంటూ చెప్పి కొందరు ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లి లైంగిక దాడులకు పాల్పడే అవకాశాలున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో వారితో వెళ్లకూడదు. ఎంత పరిచయస్తులైనా సరే మగవారి ఒడిలో కౌమారదశలో ఉన్న అమ్మాయిలను కూర్చోనివ్వరాదు. వారితో సినిమాలు, షాపింగ్‌లకు ఎట్టి పరిస్థితుల్లో వెళ్లనివ్వరాదు. – ఎం.రాంబాబు, డీఎస్పీ, పాలకొండ

వరసలు కలిపేవారితో జాగ్రత్త..



బాబాయ్, మరిది, మామ, అన్నయ్య అంటూ చిన్నపిల్లలతో వరసలు కలిపే వారిపై ఓ కన్నేసి ఉంచాలి. చనువుగా ప్రవర్తించడం, ముఖ్యంగా 13 ఏళ్ల నుంచి 15 ఏళ్ల అమ్మాయిలతో సన్నిహితంగా ఉంటున్నా, ప్రత్యేకంగా మాట్లాడుతున్నా, సెల్ ఫోన్‌లో దృశ్యాలను చూపిస్తున్నా, వారు ఎవరైనా సరే కఠినంగా వ్యవహరించాలి. – జి.కళాధర్, ఎస్సై, వీరఘట్టం

మార్కెట్‌లో మన్యం పసుపు డీలా..!

- 1512 హెక్టార్లలో సాగు
- ఎకరాకు 25–30 కావిళ్ల వరకు దిగుబడి
- పచ్చి పసుపు కావిడ రూ.600, 700 ధర
- కొనుగోలు కేంద్రాలు నిల్



బుట్టలతో పసుపుకొమ్ములు తీసుకువస్తున్న మహిళలు



వారపుసంతలో కావిళ్లతో పచ్చిన పసుపు కొమ్ములు



కొండపోడులో పండిస్తున్న పంట

సీతంపేట: మన్యం పసుపు మార్కెట్‌లోకి వచ్చింది. సరైన ధరలు లేకపోవడంతో గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు. జిల్లాలో దాదాపు 1512 హెక్టార్లలో పసుపు గిరిజనులు సాగు చేస్తున్నారు. ఇక్కడి పసుపు పంటకు నాణ్యమైనదిగా గుర్తింపు ఉండడంతో మైదాన వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. ఏజెన్సీ సంతలకు వచ్చిన పసుపు కొమ్ములను కొనుగోలు చేస్తున్నారు. జీడిపంటలో అంతర పంటగా పసుపు సాగుచేస్తారు. కుశిమి, శంభాం, జొనగ, దోనుబాయి, మర్రిపాడు, పొల్ల, కడగండి తదితర పంచాయతీల పరిధిలో ఈ పంట సాగవుతుంది. ఉద్యానవనశాఖ కూడా గతంలో ఈ పంటను ప్రోత్సహించేది. పసుపు విత్తనాలు కూడా ఇచ్చేవారు. అయితే కొన్నేళ్లుగా రైతులకు పసుపు విత్తనాలు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. రైతులే విత్తనాలు తయారు చేసుకుని సాగుచేస్తున్నారు. అంతగా పెట్టుబడులు లేకపోవడంతో గిరిజన రైతులు ఈ పంటను ఎక్కువగా పండిస్తున్నారు. మైదాన ప్రాంతాలతో పోలిస్తే ఏజెన్సీలోనే అధిక విస్తీర్ణంలో పసుపు సాగవుతుంది.

ఒక్కో కావిడ రూ.600 నుంచి 700

ఎకరా పొలంలో 10 కావిళ్ల వరకు పసుపు విత్తనాలు నాటుతారు. బాగా పండితే 25 నుంచి 30 కావిళ్ల వరకు దిగుబడి వస్తుందని గిరిజనులు తెలిపారు. అంతరపంటగా గిరిజనులు దీన్ని పండిస్తున్నారు. ఏడాదిలో రెండుసార్లు పసుపుదుంపలను తవ్వుకోవచ్చని గిరిజనులు తెలిపారు. ఒక్కో కావిడి రూ.600 నుంచి 700ల వరకు నాణ్యతను బట్టి విక్రయిస్తామని చెప్పారు. మైదానప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కొద్ది రోజులు పోతే ఎండు పసుపు కావిడ రూ.1500 నుంచి రూ.2 వేల వరకు విక్రయిస్తామన్నారు. ఎండు పసుపుకొమ్ములు తయారు కావాలంటే చాలా పనిపడుతుంది. పచ్చి పసుపును ఉడకబెట్టి బాగా ఎండబెట్టి కాళ్లతో తొక్కి నట్టయితే పైపొర పోతుందని దీన్ని వారపు సంతల్లో విక్రయిస్తామని గిరిజనులు తెలిపారు. గిరిజన సహకార సంస్థ వంటివి ఉన్నా పసుపు కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. వీడీవీకేలు నిర్వహిస్తున్నప్పటికీ నామమాత్రంగానే ఉన్నాయని గిరిజనులు తెలియజేస్తున్నారు. ఇక్కడ పసుపు గుండ తయారు చేస్తున్నప్పటికీ దానికి కూడా సరైన మార్కెట్ సదుపాయం లేదని వాపోతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. జీసీసీ పసుపు కొనుగోలు చేయడం లేదు. దీంతో దళారుల బారిన పడాల్సి వస్తోంది. గిట్టుబాటు ధరలు కల్పించాలని గతంలో అనేక వినతులు కూడా సమర్పించాం.
– ఎస్.సాయికుమార్, మాజీ సర్పంచ్, మండ

కొండపోడులో పండిస్తాం



కొండపోడులో పసుపు పండిస్తాం. అన్ని పంటలకంటే జనవరి నుంచి ఈ పంట చేతికందుతుంది. పసుపు ఉడకబెట్టి ఆరబెట్టి గ్రేడింగ్ చేయడం ద్వారా మంచి పసుపుగా తీర్చిదిద్దుతాం. అనంతరం మార్కెట్లో విక్రయిస్తాం.
– త్రినాథరావు, అచ్చిబ

ఎన్నికల నిర్వహణ అధికారిగా సబ్ కలెక్టర్



యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్‌కలెక్టర్ పాలకొండ

పాలకొండ రూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను ఫిబ్రవరి 3న నిర్వహించాల్సి ఉంది. ఈ క్రమంలో సోమవారం వెలువడిన ఆదేశాల మేరకు పాలకొండలో ఖాళీగా ఉన్న నగరపంచాయతీ చైర్మన్ ఎన్నిక నిర్వహణాధికారిగా సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో సబ్ కలెక్టర్ ఈ నెల 30వ తేదీలోగా ప్రస్తుతం ఉన్న 19 మంది పాలకవర్గ సభ్యులకు చైర్మన్ ఎన్నికకు సంబంధించిన సందేశంతో కూడిన ఉత్తర్వులు అందజేస్తారని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. ఆ మేరకు ఫిబ్రవరి 3న కౌన్సిలర్ల సమక్షంలో చైర్మన్ ఎన్నిక జరగనుంది. గతంలో చైర్‌పర్సన్‌గా యందవ రాధాకుమారి పనిచేసేవారు. భర్త నాగేశ్వరరావు మరణంతో కారుణ్యనియామకం కింద ఆమెకు ఉద్యోగం వచ్చింది. ఈ నేపథ్యంలో ఆమె పదవికి రాజీనామా చేయడంతో చైర్‌పర్సన్ పోస్టు ఖాళీ అయింది. ప్రస్తుతం 11వ వార్డు కౌన్సిలర్ పల్లా ప్రతాపరావు ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల వివరాలు

పాలకొండ:

ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని సచివాలయ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల కోసం పట్టణానికి చెందిన 230 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరంతా సొంత స్థలం పొంది ఉంటే.. వారి పొజిషన్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. ఆయనతో పాటు గృహనిర్మాణ శాఖ మధవరావు, సిబ్బంది ఉన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

మెడికల్ కిట్ల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కేంద్రాలకు ఐసీడీఎస్ పీవో కె.విజయగౌరి చేతులమీదుగా సోమవారం మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రాథమిక చికిత్స అందించేందుకు వీలుగా ఈ కిట్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. మొత్తం 16 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు కిట్లు అందించామన్నారు.



మెడికల్ కిట్లు అందజేస్తున్న ఐసీడీఎస్ పీవో విజయగౌరి

ఆక్రమణలు తొలగించండి

- ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: మండలంలో వివిధ గ్రామాల్లో ఉన్న శ్మశానవాటికల్లో చోటుచేసుకున్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. వీరఘట్టం మేజరు పంచాయతీ కడకెల్ల, తదితర గ్రామాల్లో శ్మశానాల్లో ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఉపాధి హామీ పథకం, తదితరల శాఖల పరిధిలో జరుగుతున్న రోడ్లు, భవన నిర్మాణాల ప్రగతిపై ఎమ్మెల్యే జయకృష్ణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్చి 31 లోపు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ, ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఇరిగేషన్ డీఈఈ వై.గన్నిరాజు, టీడీపీ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి, జామి లక్ష్మీనారాయణ, బల్లా హరిబాబు, ఉదయాన ఉదయ్‌కుమార్, చింతా ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

- సబ్ కలెక్టర్‌కు వినతి

పాలకొండ/పాలకొండ రూరల్: నియోజకవర్గంలోని సీతంపేట, భామిని మండలాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఆయా మండలాలకు చెందిన ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డిని సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. రెండు మండలాల పరిధిలో వైఎస్సార్ మద్దతుతో గెలిసిన స్థానిక సంస్థల ప్రతినిధులు 90 శాతం దాటి ఉన్నారని.. కాని అధికారులు ఎటువంటి సమాచారం గాని గౌరవం కాని ఇవ్వడం లేదని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన



భామిని: తమ సమస్యలు పరిష్కరించాలంటూ వెలుగు సీఎఫ్‌లు సోమవారం మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలన్నారు. కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని కోరారు. రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని నినదించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీదేవి, ధర్మరాజు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆ బదిలీకి నాకు సంబంధం లేదు

- ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అంతా గందరగోళం నెలకొన్న పరిస్థితి తెలిసిందే. ఇందులో ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శుల బదిలీలు అస్తవ్యస్తంగా చేపట్టారనే విషయం అందరికీ తెలిందే. అయితే వీరఘట్టం మండలం చినగోర పంచాయతీ కార్యదర్శి బదిలీ గందరగోళంగా మారింది. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తనకు తీవ్ర అన్యాయం జరిగిందని, తనకు న్యాయం చేయాలని మండంగి బాలాకుమారి అనే మహిళ సోమవారం వీరఘట్టం వచ్చిన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఫిర్యాదు చేసింది. ఆమెతో పాటు వచ్చిన మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్, వీరఘట్టం మండల టీడీపీ అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌కుమార్ ఈ విషయమై ఎంపీడీఓ వెంకటరమణను ప్రశ్నించారు. మీరు చేసిన నిర్లక్ష్యం వల్లే పంచాయతీ కార్యదర్శి బాలాకుమారి మూడు నెలలుగా ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతోందని నిలదీశారు. దీంతో ఎంపీడీఓ స్పందిస్తూ పంచాయతీ కార్యదర్శి బాలాకుమారి బదిలీకు నాకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం చినగోరలో పంచాయతీ కార్యదర్శిగా ఉన్న సునీల్‌కుమార్ అనే వ్యక్తిని బదిలీ చేసి ఆ స్థానంలో బాలాకుమారికి పోస్టింగ్ ఇవ్వాలని వీరంతా కోరారు. బదిలీ అంశం తన పరిధిలో లేదని ఎంపీడీఓ తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని సామరస్యంగా పరిష్కరిద్దామని ఎమ్మెల్యే జయకృష్ణ సర్దిచెప్పారు.

ఎమ్మెల్యే గారూ.. సమస్యలు పరిష్కరించరూ



ఎమ్మెల్యే జయకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న వీరఘట్టం దొంతరవీధి మహిళలు

వీరఘట్టం: మండల కేంద్రంలోని దొంతరవీధికి చెందిన తామంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. .వీధిలో ఎవరైనా చనిపోతే కనీసం పాడిని మోసుకెళ్లేందుకు కూడా రహదారి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నాం.. వీధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వీరఘట్టం పంచాయతీ పాలకవర్గానికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు .. కనీసం ఎమ్మెల్యేగా మీరైనా మా మొర ఆలకించండంటూ స్థానిక దొంతర వీధికి చెందిన మహిళలు పలు సమస్యలను ఎమ్మెల్యే జయకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం వీరఘట్టం వచ్చిన ఎమ్మెల్యే జయకృష్ణను మండల పరిషత్ కార్యాలయం వద్ద కలసి పలు సమస్యలను వినతిపత్రం అందజేశారు. కాలువలు బాగు చేయాలని, రోడ్లు వేయాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ వెంకటరమణ, పంచాయతీ ఈఓ రవిని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలి



నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): నిరుద్యోగ యువత అంతా జాబ్‌మేళాలు సద్వినియోగం చేసుకుని, ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన పలువురికి నియామక పత్రాలు కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి ఆమె అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక ఉద్యోగం చేస్తూనే ఉన్నత ఉద్యోగం కోసం యువత శ్రమించాలన్నారు. యూత్ ట్రైనింగ్ సెంటర్ల వద్ద నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం పలువురు మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు.

● హత్యాచారాలు అరికట్టాలి..



మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను ప్రభుత్వం అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘ జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షిస్తే ఇటువంటి సంఘటనలు పునరావృతం కావన్నారు. అనంతరం ఫిబ్రవరి 9న చేపట్టనున్న మహిళా సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకులు పి. రాధ, శ్రీదేవి, పి. విమల, బి. అమరవేణి, జెస్సీబాయ్, రజిని, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.
– పాలకొండ

29న ఆధార్ నమోదు శిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద ఈ నెల 29వ తేదీన ప్రత్యేకంగా ఆధార్ నమోదు శిబిరం నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం తపాలా శాఖ సూపరింటెండెంట్ ఆర్.బాబూరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. చిన్నారులకు ఆధార్ నమోదు చేయించడం తప్పనిసరి అని, ఈ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

● శతశాతం అక్షరాస్యతే లక్ష్యం



శతశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) శిక్షణా తరగతులు నిర్వహిస్తోందని ఎంపీపీ ఉరిటి రామారావు తెలిపారు. గరుగుబిల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఉల్లాస్ శిక్షణా తరగతులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. తరగతుల్లో నేర్పిస్తున్న ప్రతీ అంశాన్ని బాగా నేర్చుకుని, నిరక్షరాస్యులను సంపూర్ణ అక్షరాస్యులుగా మార్చాలని శిక్షణార్థులకు తెలిపారు. అనంతరం వలంటీర్లకు ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.
–గరుగుబిల్లి